క్లుప్తంగా

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన ఉండాలి

జెడ్పీ డెప్యూటీ సీఈఓ కృష్ణ



చేబ్రోలు: ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పంచాయతీ రాజ్ చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని జెడ్పీ డెప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ సూచించారు. చేబ్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీడీఓ కె.లలిత అధ్యక్షత వహించారు. కృష్ణ మాట్లాడుతూ గ్రామ పరిపాలన చేసేందుకు ప్రస్తుత శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని చెప్పారు. అక్టోబర్ 14 నుంచి 24వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం జరుగుతుందన్నారు. సంవత్సరానికి నాలుగు సార్లు గ్రామ సభను నిర్వహించి మూడు నెలల్లో చేసిన అభివృద్ధి పనులు సమీక్షించుకోవాలన్నారు. డీపీఆర్సీ గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ పద్మరాణి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలను సమర్థంగా ఉపయోగించుకుంటే పంచాయతీలను అభివృద్ధి చేయగలరన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.లలిత, ఈఓపీఆర్డీ ఉషా రాణి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



ప్రత్తిపాడు: అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు సమస్యలపై అడిగినప్పుడు సానుకూలంగా సున్నితంగా సమాధానమివ్వాలే గానీ దురుసుగా మాట్లాడటం చేయవద్దన్నారు. బాధ్యతతో విధులు నిర్వర్తిస్తే భవిష్యత్తు బాగుంటుందని లేదని ఇబ్బందులు తప్పవని చెప్పారు. ఎంపీడీఓ కె. శివపార్వతి మాట్లాడుతూ ఉపసర్పంచులు, వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని చెప్పారు. మన గ్రామాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దడంలో గ్రామ పంచాయతీ పాత్ర అనిర్వచనీయమన్నారు. వార్డు సభ్యులకు పాలనాపరమైన అంశాలపై ఇన్చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా శిక్షణ ఇచ్చారు.

సమస్యకు పరిష్కారం



సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ ప్రజారోగ్య విభాగం చర్యలు చేపడుతుంది. సమస్యలు పదిలం.. పరిష్కారంలో విఫలం శీర్షికన పట్టణంలో పలు సమస్యలపై సాక్షిలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. తహసీల్దార్ కార్యాలయంలో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించి ప్రదేశాన్ని శుభ్రం చేశారు. శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పెదకాకానిలో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన



పెదకాకాని: ఇజ్రాయెల్ దాడుల వల్ల పాలస్తీనాకు చెందిన 10 లక్షల మంది ప్రజలు శరణార్థులుగా మారారని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని సుందరయ్యకాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఇజ్రాయెల్, అమెరికాల ఉన్మాదాన్ని వ్యతిరేకిస్తూ పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ సముదు నిక్షేపాలపై పెత్తనం సాగించాలన్న అమెరికా ధోరణి ఈ యుద్ధాలకు కారణం అవుతుందని ఆరోపించారు. ఈ ప్రదర్శనలో పార్టీ నాయకులు బురదగుంట సాంబయ్య, చెన్నం రామకృష్ణారావు, ఆముదాల నాగేశ్వరరావు, శివలింగం సామ్రాజ్యం, బొజ్జ విజయలక్ష్మి, కె.నాగరాజు పాల్గొన్నారు.

ఖర్చులున్నాయ్.. క్యాష్ కొట్టండి

- మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు
- ఆరంభం నుంచి వసూళ్ల వ్యాపారం మొదలుపెట్టిన ఎక్సైజ్ శాఖ
- బోరుమంటున్న దరఖాస్తుదారులు



ప్రత్తిపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్

ప్రత్తిపాడు: ఎక్సైజ్ శాఖ అధికారులు ఆరంభంలోనే వసూళ్ల వ్యాపారం మొదలెట్టారు. లాటరీలో జరగలేదు.. అసలు వస్తుందో రాదో కూడా తెలియని పరిస్థితి. కానీ ఆబ్కారీ అధికారులు మాత్రం స్టేషన్ ఖర్చుల పేరుతో దరఖాస్తుదారుల నుంచి ముక్కు పిండి మరీ పైసలు వసూలు చేస్తున్నారు. లక్ ఎలా ఉన్నా లెక్క తేలనిదే పత్రాలు మాత్రం చేతికదడం లేదు.

స్టేషను ఖర్చుల పేరిట..

కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చి, నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. ఇందుకుగాను ఆయా ఎక్సైజ్ స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుకు గతంలో ఉన్న ముప్పై, నలభై వేలు ఉన్న రిఫండబుల్ డిపాజిట్ ధరను, అమాంతంగా రెండు లక్షలకు పెంచేసి నాన్‌రిఫండబుల్ నిబంధన విధించి కూటమి ప్రభుత్వం దరఖాస్తుదారుల జేబుకు పెద్ద కన్నం పెడుతుంది. ఆ కన్నం ముందు మనం పెట్టే కన్నం ఏపాటిదిలే అనుకున్నట్లున్నారు ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ అధికారులు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరి నుంచి స్టేషన్ ఖర్చుల పేరిట మామూళ్ల డబ్బులు వసూలు చేస్తున్నారు. స్టేషనుకు ఖర్చులు ఉన్నాయి.. ఎంట్రీపాస్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలంటే రూ.వెయ్యి ఇవ్వండి అని బహిరంగంగా డిమాండ్ చేసి మరీ లంచాలు తీసుకుంటున్నారు. ఇవ్వగలిగిన వారు ఇస్తుండగా, ఇవ్వలేని వారు ఎందుకివ్వాలని ప్రశ్నిస్తున్నారు.

ఇప్పుడే ఇలా ఉంటే..

గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీ మారి ప్రభుత్వ మద్యం దుకాణాలు రావడంతో వీరి చేతివాటానికి చాలా వరకు బ్రేక్ పడింది. ఇప్పుడు తాజాగా కూటమి ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురావడంతో మళ్లీ ఆ శాఖ అధికారులు చేయి చాస్తున్నారు. పాలసీ ఆరంభంలోనే వసూలు మొదలుపెట్టారు. దీంతో అసలు దుకాణాలు రాకముందే ఇలా వసూళ్లు చేస్తే, లాటరీలో దుకాణం వస్తే మన పరిస్థితి ఎలా ఉంటుందో అని దరఖాస్తుదారులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అనధికారిక వసూళ్లకు తెరదించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషనులో పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని చేబ్రోలు మండలంలో ఆరు దుకాణాలకు, ప్రత్తిపాడు మండలంలో నాలుగు, వట్టిచెరుకూరు మండలంలో మూడు దుకాణాలకు అర్జీలు స్వీకరిస్తున్నారు.

అలాంటిదేమీ లేదు



దరఖాస్తు దారుల నుంచి డబ్బులు వసూలు చేయడం ఏమీ లేదు. ఒక్కసారి విచారిస్తాను. అలాంటిది ఏమైనా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం. సమస్యల్లేకుండా చూస్తాం. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటాం.

– ఎం.రవీంద్రబాబు, ఎస్ఐ, ఎక్సైజ్ స్టేషన్

అధునాతన పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులతో కలసి వరిని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు తిరుమలాదేవి



గొడవర్రులో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖాధికారులు

పెదకాకాని: రైతులు అధునాతన పద్ధతులపై అవగాహన పెంచుకుని తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించాలని గుంటూరు సబ్ డివిజన్ ఇన్చార్జి ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అధ్యక్షత వహించారు. తిరుమలాదేవి మాట్లాడుతూ రైతులు అధునాతన పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు వాడుకోవాలన్నారు. జీవన ఎరువులైన అజోల్లా, అజోస్పైరిల్లం, అజాటోబ్యాక్టర్, ఫాస్ఫోబ్యాక్టీరియా వంటి వాటిని సేంద్రీయ ఎరువులలో కలసి వరి పైరుకు వాడాలని కోరారు. డ్రోన్ల ద్వారా పురుగు మందులు వాడటం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. తొలుత స్థానిక రైతులతో కలసి వరి పైరును పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఆర్వీ శివాజీ, ఉప్పలపాడు గ్రామ సర్పంచి కర్నాటి శ్రీనివాసరావు, వీఏఏలు పీవీ జ్యోత్స్న, విజయలక్ష్మి, ఆర్.భానుమతి పాల్గొన్నారు.

గొడవర్రులో పొలం పిలుస్తోంది

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో గొడవర్రు, గుండవరాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయంలో అధిక దిగబడులు సాధించటానికి భూమి సారవంతంగా, ఆరోగ్యవంతంగా ఉండాలని సూచించారు. గ్రామ సర్పంచి బి. జానకీదేవి, ఏఈఓ కె. సునీత, యామిని పాల్గొన్నారు.

పత్తిలో గులాబి రంగు పురుగు..

కొప్పర్రు(కాకుమాను): పత్తి సాగు చేస్తున్న రైతులు పంటపై గులాబి రంగు పురుగు ఆశించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఏఓ బి.సుధారాణి సూచించారు. పెదనందిపాడు మండలంలోని కొప్పర్రు,అన్నపర్రు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

పీసీఓడీ సమస్యపై అవగాహన అవసరం

డాక్టర్ షమ సుల్తానా



మాట్లాడుతున్న డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్: కుటుంబ బాధ్యతలతో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం మంచిది కాదని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబానికి ఏదైనా చేయగలరని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, యువ నారీస్ హెల్త్ కేర్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా పేర్కొన్నారు. బైబిల్ మిషన్ స్త్రీల సభలు మూడు రోజులుగా పెదకాకానిలోని కాకాని స్వస్తిశాలలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హోప్ విన్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా ఆధ్వర్యంలో 'స్త్రీలలో సంతానలేమి సమస్యలపై' అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ సంతానలేమి సమస్యలతో నేడు ఎక్కువమంది మహిళలు బాధపడుతున్నట్లు తెలిపారు. సమస్యలు వచ్చిన తర్వాత కంటే సమస్యలు రాకముందే అవగాహన పెంచుకుంటే సమస్యలు దరి చేరవని వివరించారు. సమస్యకు అండాశయంలో నీటి బుడగలు కూడా ఒక ప్రధాన కారణమన్నారు. మహిళ తన కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉంటూ తన ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గర్భందాల్చిన సమయంలో పోషకాహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మ నివ్వడం సాధ్యపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ బిషప్ శామ్యూల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ జాన్, రీనా శామ్యూల్, వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రమీల సెల్వరాజ్, పాస్టర్లు, బోర్డు మెంబర్స్, సంఘ సభ్యులు, వేల మంది మహిళలు, హోప్ విన్ హాస్పిటల్స్ డాక్టర్స్, మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్మాతకు జననీరాజనాలు



కొండపాటూరు శ్రీపోలేరమ్మ అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవిగా దర్శనం



ప్రత్తిపాడు అద్దంకమ్మ ఆలయంలో మహాలక్ష్మిగా అమ్మవారు



ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో చండీదేవిగా..



మంచాలలో ఆదిలక్ష్మీ కామేశ్వరి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా..



చేబ్రోలులో కనకదుర్గ అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా రూ.25 లక్షలతో అలంకరణ

కనకదుర్గ అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల ఆరో రోజు వివిధ ఆలయాల్లో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. పెదకాకాని శివాలయంలో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చేబ్రోలు విజ్ఞాన్ విద్యా సంస్థలలో నిర్వహించిన పూజల్లో చైర్మన్ లావు రత్తయ్య సతీమణి నిర్మల ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



చేబ్రోలు మండలం సుద్దపల్లిలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న కనకదుర్గమ్మవారు



ప్రత్తిపాడు దండేశ్వరాలయంలో గజలక్ష్మీదేవి అలంకరణలో పార్వతీదేవి



కొత్తరెడ్డిపాలెం ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకరణ..



వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో అమ్మవారిని పూజిస్తున్న లావు రత్తయ్య సతీమణి నిర్మల

• ప్రమాదాల మలుపు



గుంటూరు నుంచి పెదకాకాని వచ్చే మార్గంలో గడ్డిపాడు వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఇన్నర్ రింగ్‌రోడ్డు మార్గం గుండా గుంటూరు నగరంలోనికి, పెదకాకాని వైపు వచ్చే ప్రతి వాహనం గడ్డిపాడులో దెబ్బతిన్న రోడ్డు వద్ద టర్నింగ్ తీసుకుని ప్రయాణాలు సాగించాల్సి ఉంది. వేగంగా వస్తున్న వాహనాలు కోతకు గురైన రోడ్డు వద్ద గొయ్యిలో పడకుండా పోలీసులు బారికేడ్‌ను అడ్డుగా పెట్టారు. ఈ టర్నింగ్‌లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

- పెదకాకాని

పొలం పిలుస్తోంది.. వారు కదలరు

- 'పొలం పిలుస్తోంది'లో కనిపించని వ్యవసాయ అనుబంధ శాఖలు
- వ్యవసాయశాఖ అధికారులతో మొక్కుబడిగా నిర్వహణ
- టీడీపీ నాయకులు, టీడీపీ సానుభూతి పరుల పొలాల్లో క్షేత్ర సందర్శన
- నామ్‌కేవాస్తేగా అవగాహన సమావేశాలు



ప్రత్తిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయం అధికారులు

ప్రత్తిపాడు: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. కూటమి ప్రభుత్వం హంగూ ఆర్భాటంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రచారం ఎక్కువ పని తక్కువగా కనిపిస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు మినహా, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది గైర్హాజవుతుండటంతో కార్యక్రమం అభాసుపాలవుతోంది. దానికి తోడు టీడీపీ నాయకులు, టీడీపీ సానుభూతి పరుల పొలాల్లో క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తుండటంతో అధిక శాతం మంది రైతులు కూడా కార్యక్రమంపై ఆసక్తిని చూపడం లేదు.

ఇదీ ఉద్దేశం

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా సాగు వ్యయాన్ని తగ్గించడం, మెరుగైన సాగు పద్ధతులను అవలంబించడం, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, ఉత్పాదకతను పెంచడం, సాగు వ్యయాన్ని తగ్గించడం, వ్యవసాయంలో రైతుల ఆదాయ స్థాయిలను పెంచడం.. వంటి వాటిపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. రైతులు– శాస్త్రవేత్తలు నేరుగా ఇంటరాక్ట్ అవ్వడం ప్రధాన ఉద్దేశం. ఇందుకు గాను ప్రతి వారం మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించాలి. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు అనుబంధ శాఖల అధికారులతో కలిసి ఫీల్డ్ విజిట్(పొలం బాట), పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు, సాయంత్రం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు రైతులకు అవగాహన కల్పించి శాస్త్రవేత్తలకు, రైతులకు మధ్య ఇంటరాక్షన్ ఏర్పాటు చేయడం చేయాలి.

పత్తా లేని అనుబంధ శాఖలు..

ఈ కార్యక్రమాలకు వ్యవసాయశాఖ అధికారులతో పాటు ఆత్మ, ఏపీ సీఎస్ఎఫ్, ఉద్యానశాఖ, సెరీకల్చర్, పశుసంవర్థక శాఖ, ఏపీ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేషన్ ఫెడరేషన్, మత్స్యశాఖ, వ్యవసాయ మార్కెటింగ్‌తో పాటు కెనాల్స్, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం.. ఇలా పదికి పైగా శాఖలు హాజరు కావలసి ఉంది. కానీ వ్యవసాయ శాఖతో పాటు ఉద్యానశాఖ, అప్పుడప్పుడూ పశుసంవర్ధకశాఖ, ప్రకృతి వ్యవసాయం అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. దీంతో కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులే నిర్వహించి, ఫ్లెక్సీలతో నాలుగు ఫొటోలు దిగి మమ అనిపించేస్తున్నారు.

అల్లాడుతున్న రైతాంగం..

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాల్లో సుమారు పాతిక వేల మందికి పైగా రైతులు ఉంటారు. వారు ఏడాది ఖరీఫ్‌లో పత్తి, మిర్చి, మినుము, పొగాకు, వరి పంటలను సాగు చేశారు. ఇప్పటికే ఊహించని వరదలు, తెగుళ్లతో రైతులు పంటను కాపాడుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అధికారులు పొలం పిలుస్తుందికి ఎగనామం పెడుతుండటం విమర్శలకు దారితీస్తోంది. మంగళవారం కూడా ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ అధికారులే హాజరయ్యారు. పెదనందిపాడు మండలంలో నిర్వహించిన అన్నపర్రు, కొప్పర్రు గ్రామాల్లో నిర్వహించగా, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయశాఖలు మాత్రమే వచ్చారు. కాకుమాను మండలం రేటూరు, అప్పాపురంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ, వెటర్నరీ, వట్టిచెరుకూరు మండలం వట్టిచెరుకూరు, లేమల్లెపాడుల్లో జరిగిన కార్యక్రమానికి ఏ ఒక్క అనుబంధశాఖ కూడా హాజరు కాలేదు.

మా కమిషనర్‌కు కూడా తెలియజేశాం

పొలం పిలుస్తోంది కార్యక్రమానికి కచ్చితంగా అన్ని అనుబంధ శాఖలూ హాజరు కావాలి. కానీ కొన్ని శాఖలు హాజరు కావడం లేదు. విషయం నా దృష్టికి కూడా వచ్చింది. హాజరు కావాల్సిన బాధ్యత అన్ని అనుబంధ శాఖలపైనా ఉంది. ప్రతి రోజూ రాని శాఖలను బ్రతిమాలలేం కదా. ఇదే విషయాన్ని మా కమిషనర్ దృష్టికి కూడా తీసుకువెళ్లాం.

– నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి

300 మొబైల్ ఫోన్లు అప్పగింత

- విలువ సుమారు రూ.45.50 లక్షల ఖరీదు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్‌కుమార్



నగరంపాలెం: మొబైల్‌ఫోన్లు పోయాక వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసినట్లైతే, మొబైల్ ఫోన్లను గుర్తించే విధుల్లో టీఏడబ్ల్యూ పోలీస్ సిబ్బంది ఉంటారని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. సుమారు రూ.45.50 లక్షల ఖరీదు చేసే 300 రకాల బ్రాండెడ్ మొబైల్‌ఫోన్లను బాధితులకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌ఫోన్లు పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని అన్నారు. తద్వారా సెల్‌ఫోన్లల్లో సమాచారం దుర్వినియోగం కాదని చెప్పారు. అంతేగాక సెల్‌ఫోన్ బ్లాక్ అవుతుందని వివరించారు. పోగొట్టుకున్న ఫోన్లను త్వరితగతిన రికవరీ చేయవచ్చునని తెలిపారు. తమిళనాడు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధికంగా మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో ఐటీ కోర్ ఇన్‌చార్జి సీఐ నాగమల్లేశ్వరరావు, ఏఎస్ఐ రాందాస్‌రెడ్డి, కిషోర్, శ్రీధర్, అరుణ, కరిముల్లా, రమేష్, ఐటీ కోర్ పాల్గొన్నారు.